క్లుప్తంగా

ఓబీసీ సమస్యపై కేంద్ర మంత్రికి వినతి పత్రం



కేంద్ర మంత్రి వర్మకు వినతిపత్రం అందజేస్తున్న తూర్పు కాపు సంఘ నాయకులు

పాలకొల్లు సెంట్రల్: తూర్పుకాపులను ఒక ప్రాంతంలో బీసీలుగా, మరో ప్రాంతంలో ఓబీసీలుగా గుర్తిస్తున్నారని తూర్పుకాపులు ఎక్కడున్నా ఓబీసీలుగా గుర్తించాలంటూ కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మకు తూర్పుకాపు సంఘ నాయకులు వినతిపత్రం అందజేశారు. సోమవారం భీమవరంలోని మంత్రి కార్యాలయం వద్ద మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తూర్పుకాపు సంఘ నాయకులు మాట్లాడుతూ దీనిపై పార్లమెంటులో బిల్లు ఏర్పాటు చేసి ఉత్తరాంధ్ర అని లేకుండా తూర్పుకాపులకు ఓబీసీ ఫలాలు అందేలా కృషి చేయాలని కోరామన్నారు. కార్యక్రమంలో తూర్పుకాపు నాయకులు లోపించి చిరంజీవి, పాట్నూరి రమేష్, గేదెల వాసు, చీర సత్తిబాబు, బీజేపీ నాయకులు జక్కంపూడి కుమార్, మామిడి శివయ్య పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపరచాలి



డ్రెయినేజీ పూడికతీత పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

నరసాపురం: పట్టణంలో పారిశుద్ధ్య పనులు మెరుగ్గా చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య శానిటరీ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం కమిషనర్ పలు వార్డుల్లో పర్యటించి పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. డ్రెయినేజీలను శుభ్రం చేసే పనులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ రోజూ డ్రెయినేజీల పూడికతీత పనులు చేయాలన్నారు. అలాగే దోమలు పెరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలు చెత్తను రోడ్లపై వేయకూడదని సూచించారు. ఆయన వెంట మున్సిపల్ శానిటరీ అధికారులు ఉన్నారు.

భారీ వర్షంతో రోడ్లు జలమయం



వర్షం నీటితో మునిగిపోయిన కనకదుర్గ గుడి రోడ్డు

నరసాపురం: పట్టణంలో సోమవారం భారీ వర్షం పడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ దపదపాలుగా పడిన వర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. డ్రెయిన్లు పొంగి పొర్లాయి. దీంతో పట్టణంలో ప్రధాన సెంటర్‌లో మోకాలు లోతు నీరు చేరింది. బస్టాండ్, స్టీమర్ రోడ్డు, ప్రకాశం రోడ్డు ప్రాంతాలు నీట మునిగాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు నానా అవస్థలు పడ్డారు. ఫుట్‌పాత్ వ్యాపారులు తీవ్ర ఇబ్బందికి లోనయ్యారు.

పొంగుతున్న డ్రెయిన్

నరసాపురం: పట్టణంలోని రాయిపేటలో డీసీసీబీ బ్యాంకు రోడ్డులో ఉన్న డ్రెయిన్ మురుగు పారడం లేదు. దీంతో దుర్గంధం వెదజల్లుతుంది. అటుగా వెళ్లేవారు ఇబ్బందులుపడుతున్నారు. ఇటీవల కొన్ని ప్రాంతాల్లో మున్సిపల్ అధికారులు డ్రెయిన్స్‌లో పూడికతీత పనులు చేపట్టారు. అయితే ఈ పనులు కొన్ని ప్రాంతాలకే పరిమితమయ్యాయి. చాలా వరకూ ప్రధాన ప్రాంతాల్లోమాత్రం అలాగే వదిలేశారు. డీసీసీబీ బ్యాంక్‌రోడ్డులో పలు విద్యా సంస్థలుకూడా ఉన్నాయి. ఇటుగా వెళ్లేవారు ముక్కు మూసుకొని వెళ్లే పరిస్థితి. డ్రెయిన్‌ను శుభ్రంచేసి సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

సీసీ రోడ్డు పనులకు మంత్రి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

పాలకొల్లు అర్బన్: రాష్ట్రంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టినట్లు మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని గోరింటాడ, సగంచెరువు గ్రామాల్లో రూ.2 కోట్లతో నిర్మించనున్న సీసీరోడ్డు పనులకు సోమవారం మంత్రి రామానాయుడు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కడలి నాగమణి, మండెల పావని, ఎంపీటీసీ మామిడిశెట్టి లలిత కుమారి, గ్రామ పెద్దలు కోడి విజయభాస్కర్, కోడి విజయలక్ష్మి, ఈవోపీఆర్డీ టి.మూర్తిబాబు, డిప్యూటీ తహసిల్దార్ జి.నరేష్‌కుమార్, ఏఈలు వర్ధనపు శ్యాంబాబు, వీవీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

మైనర్ల డ్రైవింగ్‌తో ప్రమాదాలు

- బైక్‌లపై దూసుకుపోతున్న మైనర్లు
- పలుచోట్ల ప్రమాదాలు
- మైనర్లకు వాహనాలిస్తే కఠిన చర్యలు తప్పవంటున్న పోలీసులు



వేగంగా వాహనాలు నడుపుతున్న మైనర్లు

యలమంచిలి: రెండు నెలలు క్రితం తొమ్మిదో తరగతి చదువుతున్న మేడపాడుకు చెందిన సూర్య బైక్ మీద వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీ కొట్టడంతో తుంటి ఎముక విరిగింది. శస్త్ర చికిత్స చేసినా పూర్వంలా నడవలేని పరిస్థితి. దీంతో అతని తల్లిదండ్రుల కడుపు కోత వర్ణనాతీతం. 10 రోజుల కిందట చించినాడ వశిష్ఠ గోదావరి నది వంతెన దిగువన జరిగిన రోడ్డు ప్రమాదంలో అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం మట్టపర్రుకు చెందిన మైనర్ బాలుడు చైతన్యబాబు తీవ్రంగా గాయపడి భీమవరం ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. ఈ విధంగా మైనర్ యువకులు రోడ్డు ప్రమాదాల్లో గాయపడడం, లేదా మరణించడంతో వారి కుటుంబాల్లో చీకట్లు కమ్ముకుంటున్నాయి. తెలిసీ తెలియని వయసు, ఉరకలు వేస్తూ ఉత్సాహంగా వేగంగా దూసుకెళ్లిపోవాలనే ఆరాటం, ముందు వస్తున్న ప్రమాదాన్ని పసిగట్టలేని జ్ఞానం. వెరసి కుటుంబాల్లో తీవ్ర శోకం. మైనర్లు ద్విచక్ర వాహనాలను నడుపుతూ ప్రమాదాలకు గురై తల్లిదండ్రులను మానసిక క్షోభకు గురి చేస్తున్నారు. ఇటీవల ఎక్కువగా జరుగుతున్న సంఘటనలు ఇవే. 18 ఏళ్లు నిండకుండా వాహనం నడపడం చట్టరీత్యా నేరం. అయితే మైనర్లపై కేసులు నమోదు చేయడానికి వీలులేదు. దీంతో పోలీసులు వారిని రోడ్లపై వాహనంతో పట్టుకున్నా ఏమీ చేయలేని పరిస్థితి.

పలు ప్రమాదాల సంఘటనలు

ఇటీవల మైనర్లు బైక్‌లు, స్కూటర్లు నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు గురవుతున్న సంఘటనలు పలుచోట్ల చోటుచేసుకుంటున్నాయి. చించినాడ-దిగమర్రు జాతీయ రహదారి, కొంతేరు-దొడ్డిపట్ల వై.జంక్షన్, పూలపల్లి బైపాస్ రోడ్డు నిత్యం రద్దీతో ప్రమాదకరంగా ఉంటాయి. వాహనాలను నడపడంలో అనుభవం ఉన్న పెద్దలు సైతం ఈ ప్రాంతాల్లో చాలా అప్రమత్తంగా వెళతారు. మిడిమిడి జ్ఞానం, వేగం అదుపు తప్పితే ఏం జరుగుతుందో తెలియని మైనర్లు ద్విచక్ర వాహనాలను రయ్‌మంటూ పోనిచ్చి ప్రమాదాల పాలవుతున్న సంఘటనలు అనేకం చోటు చేసుకుంటున్నాయి. వీటిలో కొందరు చిన్నపాటి గాయాలతో బయట పడుతుంటే, కొందరు శాశ్వతం మంచాన పడుతుండగా, మరి కొందరు మృత్యువాత పడుతున్నారు.

తల్లిదండ్రులు, మైనర్లకు కౌన్సెలింగ్

పిల్లలపై వల్లమాలిన ప్రేమతో తల్లిదండ్రులు వారు మైనర్‌గా ఉండగానే బైక్‌లు, స్కూటర్లు వారి చేతికి ఇస్తున్నారు. దీంతో ప్రమాదాల సంఖ్య పెరుగుతుంది. మైనర్ బాలల ప్రమాదాలు పెరుగుతుండడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. మైనర్లు వాహనం నడిపితే తీసుకోవాల్సిన చర్యలపై ఆదేశాలు జారీ చేశారు. మైనర్లు వాహనం నడుపుతూ పట్టుబడితే వెంటనే ఆయా పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి మైనర్లకు, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. మొన్నటి వరకు మైనర్లు వాహనం నడిపితే వారిని పట్టుకున్న పోలీసులు చిన్నపాటి జరిమానాలతో వదిలేసేవారు. అయితే మైనర్ల వాహనం నడిపేతీరు, జరుగుతున్న సంఘటనల నేపథ్యంలో మైనర్లు వాహనం నడుపుతూ దొరికితే కఠిన చర్యలు చేపడుతున్నారు.

వాహనం ఇచ్చిన వారిపై కేసు



మైనర్లు వాహనం నడపడం, వారికి వాహనం ఇవ్వడం రెండూ నేరమే. మైనర్లు వాహనం నడిపితే ముందుగా తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తాం. వారికి వాహనం ఇచ్చిన వ్యక్తి, ఆ వాహన యజమానిపై చర్యలు చేపడతాం. చిన్న పిల్లలకు వాహనాలు ఇచ్చి తల్లిదండ్రులు ఇబ్బందులు తెచ్చుకోవద్దు. పోలీసులు తీసుకునే చర్యలకు బాధ్యులు కావద్దు. చిన్న పిల్లలు వాహనాలు నడిపుతూ కనిపిస్తే వెంటనే వారికి దాని వలన వచ్చే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నాం.

– కర్ణీడి గుర్రయ్య, ఎస్సై యలమంచిలి

ప్రజా ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి



కార్యక్రమంలో ప్రజల సమస్యలు వింటున్న ఆర్డీవో దాసి రాజు

నరసాపురం: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని నరసాపురం ఆర్డీవో దాసి రాజు అధికారులను ఆదేశించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమాన్ని ఆర్డీవో నిర్వహించారు. డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చి ప్రజలు అందించిన ఫిర్యాదులు, దరఖాస్తులను పరిశీలించారు. కార్యక్రమంలో మొత్తం 20 ఫిర్యాదులు అందినట్లు ఆర్డీవో చెప్పారు. కార్యక్రమంలో డివిజన్‌లోని అధికారులు పాల్గొన్నారు.

ఆత్మహత్యా యత్నం

పాలకోడేరు: మండలంలోని పెన్నాడపాలెం గ్రామానికి చెందిన ఆరేపల్లి వెంకటేశ్వరరావు తన సరిహద్దు విషయంలో బుర్రా రమేష్, బుర్రా చంద్రరావు, బుర్ర ప్రసన్న అను వారితో జరిగిన గొడవకు మనస్థాపం చెంది పురుగుల మందు తాగాడు. బాధితుడు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆస్పత్రి వర్గాల సమాచారం మేరకు ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేశామని పాలకోడేరు పోలీసులు తెలిపారు.

వెళ్లి రావమ్మా.. కనకదుర్గమ్మా!



మొగల్తూరు: అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు



సిద్ధాంతంలో కాళికా ఉగ్రరూప వేషధారణ

ముగిసిన దసరా ఉత్సవాలు

మొగల్తూరు: దేవి నవరాత్రుల ముగింపు సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం అమ్మవారి ఊరేగింపులు ఘనంగా నిర్వహించారు. మొగల్తూరులోని సత్రవుపాలెం, వడయార్‌పేట ప్రాంతంలోని అమ్మవార్లను గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. యువకుల నృత్యాలతో పాటు శక్తివేషాలు, బాణసంచా కాల్పులతో అమ్మవారిని ఊరేగించి, నిమజ్జనం చేశారు.

ఘనంగా గొంతేనమ్మ జాతర

పేరుపాలెం నార్త్ ఇంజేటివారిపేటలో వేంచేసి యున్న శ్రీ గొంతేనమ్మ అమ్మవారి జాతరను ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం, శ్రీవాణి ట్రస్టు, సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయాన్ని నిర్మించారు. దసరా శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారి జాతరను ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు తమ్ము వెంకటరమణ మూర్తి, కటకంశెట్టి గోవర్ధన్, కటికల బాలాజి, ఆముదాలపల్లి రాంబాబు, తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

వేడుకగా కనక దుర్గమ్మ గ్రామోత్సవం

పెనుగొండ: సిద్ధాంతంలో కనకదుర్గమ్మ అమ్మవారి గ్రామోత్సవం కనుల పండుగగా నిర్వహించారు. శరన్నవరాత్రులు ముగియడంతో సోమవారం సిద్ధాంతం బస్టాండ్ సెంటర్‌లోని అమ్మవారు, ఘటాల దిబ్బ శెట్టిబలిజ జై దుర్గా భవానీ యూత్ వారి దుర్గమ్మ, చింతల పాలెం, కొబ్బరి తోట పాలెం శెట్టిబలిజ సంఘాలు, శ్రీకృష్ణదేవరాయ కాపు తెలగా సంఘాల ఆధ్వర్యంలో ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన ఉత్సవాలు ముగియడంతో మండపాల్లోని కనకదుర్గమ్మ ప్రతిమలకు గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్పులు, అమ్మవార్ల ప్రత్యేక నృత్య రూపకాలు, విచిత్ర వేషధారణలు ఆకట్టుకున్నాయి. గ్రామోత్సవం అనంతరం వశిష్టా గోదావరి కేధారీ ఘాట్‌లో నిమజ్జనం చేశారు.



పెనుగొండ: సిద్ధాంతంలో కనకదుర్గమ్మ గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



అమ్మవారిని దర్శించుకుంటున్న సమరత సేవా ఫౌండేషన్ సభ్యులు



పాలకొల్లు సెంట్రల్: పల్లకీలో అమ్మవారిని ఊరేగిస్తున్న ఉత్సవ కమిటీల సభ్యులు

పల్లకిలో అమ్మవారి ఊరేగింపు

పాలకొల్లు సెంట్రల్: దేవీ శరన్నవరాత్రుల ముగింపు ఉత్సవాల్లో భాగంగా అమ్మవార్లను నిమజ్జనం చేశారు. సోమవారం పట్టణ పుర వీధుల్లో అమ్మవార్లను సన్నాయి వాయిద్యాలతో, గరగల నృత్యాలతో ఊరేగించారు. స్థానిక చేపల మార్కెట్ నందు నిర్వహించిన అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని పల్లకిలో ఊరేగించి, అనంతరం నిమజ్జనం చేశారు.

పదవులకు రాజీనామా చేసి పార్టీ మారాలి



కొల్లాబత్తుల రవికుమార్

మొగల్తూరు: పార్టీ ద్వారా వచ్చిన పదవులకు రాజీనామా చేసి, పార్టీ మారాలని ఏఎంసీ మాజీ చైర్మన్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొల్లాబత్తుల రవికుమార్ సోమవారం ఓ ప్రకటనలో సూచించారు. వైఎస్సార్‌సీపీ మద్దతుతో ఎన్నికై పదువులు అనుభవిస్తూ ఆ పార్టీకి వెన్నుపోటు పొడిచి పార్టీ మారిన మీకు నైతిక విలువలు ఉంటే ముందుగా ఏ పార్టీతో గెలిచామో ఆ పదవులకు రాజీనామా చేయాలన్నారు. రాజకీయాలు గురించే మాట్లాడే మీకు ఉన్న నైతిక విలువలు ఏపాటివో ప్రజలు అర్థం చేసుకుంటారన్నారు. ఓటేసిన ప్రజలను మోసం చేసిన మీరు మీరు ఎవరినైనా మోసం చేయగల సమర్థులని అర్థమవుతుందన్నారు. మీకు ధైర్యం ఉంటే ముందుగా మీ పదవులకు రాజీనామా చేసి అప్పుడు పార్టీ మారాలన్నారు. పదవులకు రాజీనామా చేయించి, ఆ తర్వాత గెలిపించుకొని మీ పార్టీ కండువా కప్పాలని నాయకులకు సూచిస్తున్నానన్నారు.

దివ్యాంగులను ఆదరించాలి



భవిత సెంటర్‌లో అవగాహన కార్యక్రమం

తాడేపల్లిగూడెం (టీఓసీ): దివ్యాంగులను ఆదరించాలని, ప్రతి పాఠశాలలోను అభ్యసన సమస్యలు కలిగిన పిల్లలు సుమారు 20 శాతం మంది ఉన్నారని, పాఠశాల ఉపాధ్యాయులు పిల్లల లోపాన్ని గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ప్రత్యేక ఉపాధ్యాయులు కట్టా సరేష్ కుమార్ అన్నారు. పట్టణంలోని స్థానిక సుబ్బారావుపేట భవిత దివ్యాంగుల కేంద్రంలో సోమవారం దివ్యాంగుల పిల్లలు, అభ్యసన సమస్యలపై వారి తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భవిత సెంటర్ నిర్వాహకులు ఎస్‌కే బాల ఈశ్వరయ్య మాట్లాడుతూ చదవడం, రాయడం, భాషను వ్యక్తం చేయడం, లెక్కలు తదితర సమస్యలు కలిగి ఉంటారని, చిన్న వయస్సులోనే ఆయా సమస్యలను గుర్తించి వారికి మంచి శిక్షణ అందిస్తే రాణిస్తారని తెలిపారు. భవిత సెంటర్‌లో లోపాలు కలిగిన పిల్లలు, వారికి అందుతున్న సంక్షేమాలు, అందిస్తున్న ప్రత్యేక శిక్షణ తదితర విషయాలపై అవగాహన కల్పించారు.

అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి



మహాసభలో సీపీఎం పార్టీ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సీపీఎం అపరాల మార్కెట్ శాఖ 8వ మహాసభ సోమవారం స్థానిక సీతారాం పేట చుక్కా అప్పలస్వామి భవనంలో గొన్నాబత్తుల నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ పట్టణంలోని స్థానిక సమస్యలపై ఉద్యమించాలన్నారు. కరెడ్ల రామకృష్ణ, జవ్వాది శ్రీనులు మాట్లాడుతూ రోడ్లు, డ్రెయినేజీలు, మంచినీటి సరఫరా, ఆస్తి పన్ను, నీటి పన్నులు మీద ఆందోళన చేయాలని, టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు వెంటనే ఇవ్వాలన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నూతన శాఖ కార్యదర్శిగా పోతు శ్రీను ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో కార్మికులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధికి చర్యలు



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పితాని

పెనుగొండ: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. సోమవారం పల్లె పండుగలో భాగంగా నిర్వహిస్తున్న పల్లె వారోత్సవాల కార్యక్రమంలో ఆచంట పొర, ఆచంట నటరాజ్ థియోటర్ దగ్గర కాలనీ, మన్నే వారి వీధి వద్ద కాలనీ, బొంతు వారి పాలెం కాలనీ, మానేవారి పాలెం కాలనీలలో రూ.1.90 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ దిగమర్తి సూర్యకుమారి, జెడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్, మండల టీడీపీ అధ్యక్షుడు కేతా మీరయ్య, జనసేన అధ్యక్షుడు జవ్వాది బాలాజీ శ్రీనివాసు, తహసీల్దార్ ఎం.సోమేశ్వరరావు, ఎంపీడీవో శ్రీకర్, నాయకులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం

పెనుమంట్ర: స్థానిక ప్రజా ప్రతినిధులకు ప్రాధాన్యత ఇస్తూ రాజకీయాలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేస్తానని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. సోమవారం మధ్యాహ్నం ఎంపీపీ కర్రి వెంకటనారాయణరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. ఆచంట నియోజకవర్గంలో రూ.100 కోట్లతో గ్రామాల్లో తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామని, దీనికి సీఎం చంద్రబాబు నాయుడు ఆమోదం తెలిపారని చెప్పారు. ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే సహకారంతో గ్రామాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు వాసంశెట్టి కిరణ్; ఈది అనిత, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి నిధులతో గ్రామాల అభివృద్ధి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే నాయకర్, తదితరులు

నరసాపురం రూరల్: గ్రామాల అభివృద్ధికి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు దోహదపడతాయని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం నరసాపురం మండలం మర్రితిప్ప బీసీ కాలనీలో రూ.30 లక్షలతో నిర్మించిన మూడు అంతర్గత రహదారులను కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో అర్హులైన వారు ఉపాధి పనులు ఎక్కువ చేస్తే మెటీరియల్ కాంపోనెంట్ ద్వారా గ్రామాలను మరింత అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. పల్లెల అభివృద్ధి కోసం ప్రభుత్వం పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల కార్యక్రమం చేపట్టిందన్నారు. ఎమ్మెల్యే నాయకర్ మాట్లాడుతూ గ్రామాలను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ అప్పారావు, తహసీల్దార్ రాజరాజేశ్వరి, ఎంపీడీవో రామకృష్ణంరాజు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు పింఛన్లు అందించాలి

తాడేపల్లిగూడెం రూరల్: అర్హులైన వారికి కొత్తగా పింఛన్లు మంజూరు చేయాలని సీపీఎం మండల కమిటి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సోమవారం మండలంలోని ఇటుకులగుంట గ్రామంలో సీపీఎం మండల కమిటి సమావేశం కండెల్లి సోమరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు కావస్తుందని, కొత్త పింఛన్ల కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కొత్త పింఛన్లు మంజూరు చేయాలని, ఇసుక సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మండల కమిటి సభ్యులు ఎస్.నాగేశ్వరరావు, పి.జయమ్మ, పూరెళ్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో సముదాయాన్ని పరిశీలించిన కమిషనర్

తాడేపల్లిగూడెం: టిడ్కో భవన సముదాయాన్ని సోమవారం మునిసిపల్ కమిషనర్ ఏసుబాబు అధికారులతో కలిసి పరిశీలించారు. పిచ్చి మొక్కలు తొలగించి, పారిశుద్ధ్య పరిస్థితులను మెరుగుపర్చాలని సిబ్బందిని ఆదేశించారు. తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో 24 గంటలు పనిచేసే విధంగా మునిసిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే ఈ నెంబర్‌కి ఫోన్ చేసి 08818 224188 తెలియజేయాలన్నారు.

కరపత్రాల పంపిణీ

తణుకు అర్బన్: వర్షాకాలంలో సీజనల్‌గా వచ్చే జ్వరాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో సోమవారం నిర్వహించిన ఫీవర్ సర్వే, మస్కిటో బ్రీడింగ్ సోర్సెస్, కీటకజనిత వ్యాధులపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆరోగ్య జాగ్రత్తలు తెలిపే కరపత్రాలు పంపిణీ చేశారు.

వడలిని వరించిన కిక్ లక్

పెనుగొండ: మద్యం దుకాణాలు దక్కించుకోవడానికి వందలాది మంది వేలాది దరఖాస్తులు దాఖలు చేసి లక్ చేసుకున్నా ఫలితం లేక నిరాశ చెందారు. కానీ, ఒకే గ్రామం నుంచి ముగ్గురు మూడు మద్యం దుకాణాలు దక్కించుకున్నారు. పెనుగొండ మండలంలో తొమ్మిది దుకాణాలు ఉన్నాయి. పోటాపోటీగా బడా సిండికేట్లతో పాటు, కొత్తవారూ దరఖాస్తులు చేసుకున్నారు. బడా సిండికేట్లకు లక్ కిక్‌ను ఇవ్వలేదు. వడలి గ్రామం నుంచి పలువురు పలు సిండికేట్లలో సభ్యులుగా ఉండి మద్యం దుకాణాలకు దరఖాస్తులు చేసుకున్నారు. వీరిలో ఉండ్రాజవరం సిండికేట్ నుంచి తొంటా వెంకట సుబ్రహ్మణ్యం, సిద్ధాంతం సిండికేట్ నుంచి ఉప్పలపాటి చంటి, తణుకు సిండికేట్ నుంచి ఉప్పలపాటి లక్ష్మణరావులను అదృష్టం వరించింది. దీంతో ఒకే గ్రామం నుంచి ముగ్గురుకి మద్యం దుకాణాలు స్వంత మండలంలోనే దక్కడంతో వడలిని లక్ వడలి అంటున్నారు.

ప్రజలందరూ ఆరోగ్య నియమాలు పాటించాలి

తాడేపల్లిగూడెం రూరల్: ప్రజలందరూ ఆరోగ్య నియమాలు పాటించాలని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. సోమవారం మండలంలోని కుంచనపల్లి గ్రామంలో ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, నీటి నిల్వలు లేకుండా చేసుకొని వారానికొకసారి డ్రైడే పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఆరోగ్య సిబ్బంది దానమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ శ్రావ్య, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్త కుమారి, ఆరోగ్య సహాయకులు కమలాకర్, ఏలూరి కాంతారావు పాల్గొన్నారు.